"మీా అమ్మాయి నచ్చింది. ముహూర్తం పెట్టించి జాబు రాస్తాం. అని వెళ్ళి, ఇంకా రాశారు కాదేమిటి?" అన్నది శ్యామలమ్మ.

"మనమే రాస్తేనో పోనీ?" అన్నారు త్రివిక్రమరావుగారు.

"రాయడం కాదు. పెళ్ళిముహూర్తం పెట్టించుకు రండి" అన్నదామె

రావుగారు ఆనాడే అమలాపురం నుండి ఏలూరు వెళ్ళి శోభనాద్రిగారిని ఏం సమాధానం చెప్పను?" అన్నారు.

శోభనాద్రిగారు లోపలకు వెళ్ళి ఒక కవరు తెచ్చి, అందులో ఉన్న జాబును పైకి తీసి రావుగారి కిచ్చారు. అమలాపురం నుండే వచ్చిన ఒక ఆకాశరామన్న ఉత్తరం అది. అందులో, "మీరు కోడలిగా చేసుకుందామనుకొంటున్న త్రివిక్రమరావుగారి కుమార్తె 'కనకసంపన్న'యే కాని, 'కన్య' మాత్రం కాదు. ఆమె తన మానాన్ని మరో యువకునకు అర్పించేసు

● పాలంకి వెంకటరామచంద్రమూర్తి

---

# కీడు చేసిన మేలు

కలుసుకున్నారు. శోభనాద్రిగారు, "అయ్యా! మా అబ్బాయికి మేం మరో సంబంధం చూసుకుంటున్నాం" అని ముక్తసరిగా చెప్పి ఊరుకొన్నారు.

రావుగారు కొన్నిక్షణాలు భ్రాన్తపడి మౌనంగా ఉండిపోయారు. తేరుకున్నాక ఆయన, "అయ్యా! మా సంయుక్తకు పెళ్ళి నిశ్చయమయినదని బంధుమిత్రు లందరికీ తెలిసింది. ఇప్పుడు ఈసంబంధం ఎందుకు తప్పిపోయిందీ అన్న ప్రశ్నకు కొన్నదన్న సంగతి ఇందుతో జతపర్చిన ఫొటోవలన తమకు విశద మౌతుంది" అని ఉంది!

సంయుక్తా, ఆమె సరసనే ఒక యువకుడూ ఉన్న ఫొటో అది. ఆ ఛాయా చిత్రాన్ని చూడటంతోనే రావుగారి కంతా అయోమయమై పోయింది. 'ఆ ఆకాశ రామన్న ఎవడు?' అన్న ప్రశ్న కన్న, ఈ యువకుడెవడు? అన్న ఆలోచన ఆయనను కలవర

పరచింది.

ఏలూరు నుండి తిరిగి వచ్చిన భర్త ముఖ వైఖరిని గమనించడంతోనే శ్యామ లమ్మ, "ఏం జరిగింది?'' అన్నది. ఆయన పట్టుకొచ్చిన ఆ ఉత్తరాన్నీ, ఫొటోనూ చూశాక, మీరు తొందరపడి పిల్లనేమీ అడక్కండి; నేను తెలుసుకు చెపుతాను'' అన్నది మెల్లిగా.

ఆరాత్రి శ్యామలమ్మ, ఆప్యాయంగా కుమార్తె తలనిమురుతో, ''ఈ అబ్బాయి సంగతి ముందే చెపితే ఈ సంబంధమే నిశ్చయం చేయిద్దును కదా'' అన్నది.

"ఆ అబ్బాయెవరో మీ కెంత తెలుసో నాకూ అంతే తెలుసునమ్మా.''

"ఐతే మీ రిద్దరూ ఉన్న ఈ ఫొటోగ్రాఫ్ సంగతేమిటి మరి?"

"ఏమోమరి; నాకూ అయోమయం గానే ఉంది" అన్నది సంయుక్త.

మర్నాడు ఆమె సహాధ్యాయిని ఉషారాణి వచ్చి "ఏం సంయుక్తా అలా ఉన్నావేం? ఒంట్లో బాగుండలేదా? ఓమూల పెళ్ళి, మరోవంక పరీక్షలు దగ్గర పడుతున్నాయి; రోగం, రొచ్చూ రాకుండా జాగ్రత్తగా వుండాలి," అన్నది.

"పెళ్ళి ఆగిపోయింది ఉషా. వాళ్ళు మరో సంబంధం చూసుకుంటున్నారట."

"ఏం, అదేం పోయేగాల మొచ్చిందా ప్రబుద్ధుడికి? నీకు అందముంది, చదువుంది. ఒక్కగాని ఒక్క కూతురివి; బోలెడా స్తితో దక్కుతోంటే చేదని పించిందా ఆ పైత్య రోగికి?"

"వాళ్ళ సంగతి వదిలెయ్యి. యీ అబ్బాయెవరో నీకు తెలుసా?" అంటూ సంయుక్త ఆ ఫొటోను ఉషారాణికి చూపించింది.

"ఎంతో బాగున్నాడే ఎవరో కాని! ఇలాంటి అందగా డుండగా ఆ ఏలూరబ్బాయిని చేసుకోడానికి నువ్వెందు కొప్పుకున్నట్లు? ఆ సంబంధం పోయింది కనుక పీడవదలిం దనుకుని మీ అమ్మతో ఈ స్నేహితుడిసంగతి చెప్పెయ్యి. నీకు సిగ్గయితే నే చెపుతా పిన్నిగారితో."

"స్నేహితుడేకాదు ఉషా. ఇతడెవరో నే నెరగను. ఎన్నడూ చూడలేదు."

ఉషారాణి కొంచెం వెటకారంగా, "ఐతే, ఈ ఫొటోలో అతని పక్క నున్నది నువ్వే అని ఐనా ఒప్పుకుంటావా?"

"ఆ పోజులో నేను ఒక ఫొటో తీయించుకున్న మాట నిజమే .... ఒక ప్రింటు నా ఆల్బమ్‌లో ఉంది. రెండోది ఆ నాడు నేను చదువుతూన్న ఓ లైబ్రరీ పుస్తకంలో పెట్టినట్టు గుర్తు. ఆ పుస్తకం ఇచ్చేసినప్పుడు ఆ ఫొటో అందులో ఉండిపోయిం దనుకుంటాను' నిన్న లైబ్రరీలో ఆ బుక్కు తీసి చూశాను కాని ఫోటో లేదు. ఆ పుస్తకం ఈ లోగా ఎన్ని చేతులు మారిందో మరి?".... ఇతని ఫోటోలోకి నే నెలా వచ్చానో, లేక నా ఫొటోలోకి ఇతనెలా

వచ్చాడో అంతా మిష్టరీగా ఉంది. ఈ ఫొటోను మన ఊరివాళ్ళే ఎవరో ఆ ఏలూరువాళ్ళకు పంపి, పెళ్ళిచెడగొట్టేరు. ఈ అబ్బాయెవరో తెలుస్తేకాని యీ రహస్యం తేలదు."

"ఇతడు మన కాలేజీలోవాడుమాత్రం కాదు. కాలేజీవాడే అయితే చుక్కలలో చంద్రునికిమల్లే మనకి కనపడే ఉండును కదా....చూద్దాంలే. ప్రస్తుతానికి పెళ్ళి బెడద తప్పింది గనుక, పరీక్షలో ఫస్టు క్లాసు పోకుండా చూడు" అన్నది ఉషా రాణీ.

సంయుక్త పెళ్ళిసంబంధం తప్పి పోయిందన్న సంగతి వాళ్ళు కాపురమున్న కూచిమంచివారి అగ్రహారంలో ఇంచు మించు అందరికీ తెలిసిపోయింది, కాని వాళ్ళెవరూ రావుగారిదాకా వెళ్ళి సంబం ధం తప్పిపోవడానిక్కారణం ఎక్క దీయడానికి ప్రయత్నించలేదు. ఆయన ఆప్తమిత్రుడు రామకోటయ్య మాత్రం పరామర్శించకుండా ఉండలేక పోయాడు. "ఎందుకైతేనేం, సంబంధం తప్పిపోయాక ఇంక ఆ ప్రసక్తి దేనికి?" అనేశారు రావుగారు.

"ఇంతకీ ఆ సంబంధం తప్పిపోవ డమే మంచిదిలెండి!" అన్నాడు రామ కోటయ్యా.

రావుగారు ప్రశ్నార్థకంగా చూశారు. కోటయ్యా. "ఆ కుర్రవానికి టీ.బీ.లాంటి దేదో ఉన్నదని విన్నాను" అని వివరిం చాడు. "మన సంయుక్తకేమిటయ్యా, నిక్షేపంలాంటి పిల్ల! కళ్ళకద్దుకు చేసు కునే వాళ్ళెందరో ఉన్నారు!" అని కూడా భరోసా ఇచ్చాడు. రావుగారు మౌనంగా ఉండేసరికి, 'వస్తాను' అంటూ వెళ్ళి పోయాడు.

లోపలనుండి విన్న సంయుక్తతల్లితో "పరీక్షలైపోయేదాక, ఇంక మళ్ళీ పెళ్ళిని గూర్చి ఆలోచించకండి" అని చెప్పే సింది.

నాలుగు రోజులు గడిచాక రామ కోటయ్య బావమరిదివచ్చి, "మీ సంయు క్తకు సంబంధం చూడలేదా మళ్ళీ?" అన్నాడు.

"నీ ఎరుకలో మంచి సంబంధం ఏదైనా ఉన్నదా యేమిటి?" అన్నారు రావుగారు,

"ఉంది గనుకనే వచ్చాను. ఎం. ఏ. పరీక్ష కెడుతున్నాడు. మాంచి వర్ఛూ, పొడుగూ ఉన్న విగ్రహం. అంత మన్మ ధుడేం కాదనుకోండి. ఇంతకీ మగాడికి అందం దేనికి!"

"ఏ ఊరు వారేమిటి?"

"మన అగ్రహారంలో వాడే. మా మేనల్లుడే పెరటి చెట్టులా ఇన్నాళ్ళూ మీకు అనలేదు కాని. వాడికి ఎన్నో సంబంధాలు వస్తున్నాయి."

రావుగారు, "ఐతే వాటిల్లో ఒకటి అతగాడిని నిశ్చయించి చేసేయ్యండి" అన్నారు. వచ్చినాతని నోరు ఇంక

పెగలక. అతడు వెళ్ళడంతో సంయుక్త తండ్రి ముఖంకేసి చూస్తో" భలేవాడివి నానా ?" అన్నట్లు చిరునవ్వు నవ్వింది.

ఆ మరునాటి సాయంత్రం ఉషారాణి "కనూగొంటీ! కనూగొంటీ !" అని హుషారుగా పాడుతూ ప్రవేశించింది.

"ఏమిటే ?" అన్న సంయుక్త ప్రశ్నకు సమాధానంగా "నిన్న మా నాన్న గారితో సబ్‌జడ్జిగారింట టీ పార్టీకి వెళ్ళేను. వాళ్ళబ్బాయి ఇండియన్ పోలీసు సర్వీసుకు సెలక్టయాతన్న సంతోషంతో జడ్జిగారు ఆ పార్టీని ఇచ్చారు. ఆ ఐ. పి. యస్. అబ్బాయిని జడ్జిగారు మా టేబిల్ వద్దకు తీసుకొచ్చి మా నాన్న గారికి పరిచయం చేశారు. నేను చూసీ చూడ్డంతో అతగాడే మన కథా నాయకుడని పోల్చేసుకున్నాను. నీ ఫొటోలో ఉన్న యువకుడు ముమ్మూర్తులా ఆ సుధాకర్రావే !" అంది.

## 2

ఆదివారం ఉదయం తమ భవనంలో తీరికగా పేపరుచూసు కుంటూన్న సబ్‌జడ్జి గారి ముందు సంయుక్త ప్రత్యక్షమై ధైర్యంగా "సుధాకర్రావుగారున్నా రాండి"? అని అడిగింది. ఆయన లేచి లోపలకు వెళ్ళి "నీకోసం ఎవరో వచ్చారు రా అబ్బాయ్" అంటూ పేపరు పెట్టేసి, స్నానానికి వెళ్ళారు. సుధాకర్ ఆ అపరిచితురాలు పెడుతూన్న నమస్కారానికి ప్రతి నమస్కారం చేస్తో, "కూర్చోండి" అని, తనూ కూర్చున్నాడు.

సంయుక్త కాలయాపన చెయ్యకుండా ఆ ఫొటోను తీసి అతని బొమ్మను చూపుతో," ఇది మీరేకదా ?" అన్నది.

అతడు నిర్ఘాంత పోతూ. "నేను ఆనర్సు ప్యాసయాక సెలవుల్లో మొదటి సారిగా ఈ ఊరు వచ్చినప్పుడు 'కేశవరామ్ స్టూడియో'లో ఇలాంటి ఫోటో ఒకటి సింగిల్‌గా తీయించు కున్నాను. మీరెవరో ఎరగనిదే ఈ ఫొటోలోకి ఎలా వచ్చానో అర్థం కావటంలేదు" అన్నాడు.

అతడూ తనకులాగే ఏ పాపం ఎరగని వాడని తెలిసి పోయిందామెకు, తనకు నిశ్చయమైన పెళ్ళి సంబంధం ఎలా విడిపోయినదీ ఆమె అతనికి వివరించింది.

అతడు. "మీ కభ్యంతరం లేకపోతే ఈ ఫొటోను ఇక్కడ ఉంచి వెళ్ళండి. మొన్న టీ పార్టీలో ఇక్కడి పోలీసు ఆఫీసర్లతో నాకు పరిచయమైంది, ఈ రసహస్య మేమిటో కూపీ తీయిస్తాను." అన్నాడు.

"నా ఫొటోను 'వీనస్ స్టూడియో' వాళ్ళు తీశారు. మీ ఎన్‌క్వైరీకి పనికి వస్తుందేమోనని చెపుతున్నాను" అన్నది సంయుక్త.

ఆమె ఇంటికి తిరిగి వచ్చి తల్లితో

జరిగినదంతా చెప్పింది. శ్యామలమ్మ భర్తకు తెలియజేసింది.

సంయుక్తకు పరీక్ష లైపోయాయి. దరిమిలా ఒక నా డు సుధాకరరావే వారింటికి వచ్చాడు. రావు దంపతులు అతణ్ణి ఆదరించి, అతడు చెప్పవచ్చిన దాన్ని ఉత్సుకతతో విన్నారు.

"కేశవరామ్ స్టూడియో"లో వాకబు చేయగా వాళ్ళు నా ఫొటో కా పీ ని మౌంట్ చేసి అద్దాలకేస్‌లో నలుగురికీ కనపడేటట్లు ఎగ్జిబిట్‌గా పెట్టే వాళ్ళమనీ, కాని దరిమిలా ఆ ఫోటో మాయమైన దనీ చెప్పేరు. అప్పుడే కొంత క్యాష్ కూడా పోయినట్లు తెలియడంవల్ల నౌఖరు కుర్రవాడిపై అనుమానం తగిలి మాని పించేశా రుట. మీ సంయుక్తగా రిచ్చిన ఫొటోను చూపగా ఆమె ఎవరో వాళ్ళకు తెలియదన్నారు. మీ అమ్మాయి ఫొటో తీసిన వీనస్ ఫొటోగ్రాఫర్సుకు చూపగా ఆమెను గుర్తుపట్టేరు గాని, నేనెవరో తెలియదన్నారుట. ఈ టౌనులో వున్న తక్కిన స్టూడియో వాళ్ళనందర్నీ అడగ టం జరిగింది. ఒక్క 'ఉమా ఇమేజస్' వాళ్ళు తక్క, తక్కిన ఫొటో గ్రాఫ ర్సెవరూ, నన్ను గాని, సంయుక్తగారిని కాని పోల్చుకోలేదు. ఉమా ఇమేజస్ ప్రొప్రయిటర్ మాత్రం 'ఈ అమ్మాయి తండ్రిగారు ఈ రెండు ఫొటోలూ తెచ్చి మా అల్లుడు మిలటరీలో ఉన్నాడు; ఇప్పట్లో రావడం పడదు. మా అమ్మాయి ఈ రెండు ఫొటోలనూ కంబైన్ చేసి తెచ్చి పెట్టమన్నది. మీరు చెయ్యగలరా? అన్నారు .... మేం చేసి ఇచ్చాము. అని చెప్పేడుట."

అంతవరకూ విన్న రావుగారు ఆ ఫోటోను సుధాకర్ చేతిలోంచి అందు కుని పరిశీలించి ఆ ఫోటో గ్రాఫరెవరో కాని చాలా నేర్పుగా చేశాడు. ఒకళ్ళ పక్కన ఒకళ్ళు ఉండి తీయించుకున్న ఫోటోలాగే ఉంది!" అని మెచ్చు కున్నారు....మొదట మనకి తోచిందికాదు కాని ఈ రెండు ఫోటోలూ కంబైన్ చేసినవే. నాకు బదులు మా సంయుక్త తండ్రి పాత్ర నటించిన ఆ పెద్దమనిషి పేరూ, చిరునామా ఆ స్టుడియో వాళ్ళ ఆర్డరు బుక్కులో లభించలేదా మరి?" అని అడిగారు రావుగారు,

ఆర్డరు బుక్కులో పేరు రాసుకుందా మని అడిగితే వినిపించుకోకుండా ఆయన 'మీ ఛార్జీ ఎంత ? అని తెలుసుకొని సొమ్ముముందే ఇచ్చేసి వెళ్ళిపోయాడుట ఆయనకు చెముడేమో అన్నాడా ప్రొప్ర యిటరు, సబినస్పెక్టరు మాత్రం పేరు రికార్డులో ఉండకుండా చేయడంకోసం చెముడు నటించి ఉంటా డన్నాడు" అని చెప్పేడు....సుధాకర్.

"ఈ ఫోటో ఎలా సృష్టించబడ్డదో తెలిసిందేకాని, ఆ విలన్ ఎవరో బైట పడలేదన్నమాట ఇంతకీ?" అన్నారు రావుగారు.

"ఆ మనిషిని చూస్తే అనవాలు కట్ట గల నన్నాడు ప్రొప్రయిటరు."

"ఎంతమందిని చూపించగలం తీసు కెళ్ళి ?"

"ఆ పోలీసాఫీసరు, 'కొంచెం శ్రమ పడుతుంది కాని ఈ మనిషెవరో కనుక్కో లేకపోం' అన్నాడు ............ దానికేంగానీ. నేను చెప్పవచ్చినదేమంటే మీరు ఏలూరువారి అడ్రసు ఇస్తే, నే నక్కడకు వెళ్ళి పెండ్లికుమారుణ్ణి కలుసు కుని, యధార్థాన్నిచెప్పి కనువిప్పు కలుగ చేస్తాను. "ఎవరో దుర్మార్గుడు రాసిన ఉత్తరాన్నీ ఈ ఫొటో నూ నమ్మి సంయుక్తగారిలాంటి నిక్షేపాన్నిపోగొట్టు కోకండి. అని నచ్చ చెబుతాను," అన్నాడు సుధాకర్.

అతని మాటలు సంయుక్త హృద యాన్ని స్పందింపచేశాయి. "లోకంలో ఇంత మంచివాళ్ళుంటారా ?" అనిపిం చిం దామెకు. ఒకక్షణంఅయ్యాక ఆమెయే కలుగచేసుకుని, "వద్దులెండి. ఇంక ఆ ఏలూరివారి ప్రసక్తి అనవసరం. ఏ మంటారా, వారు నిజం తెలుకోదలచిన వారే అయితే, మా నాన్న వాళ్ళ గుమ్మం ఎక్కినపుడు అంత నిర్మొహమాటంగా చెప్పి పంపించి వెయ్యకపోదురు ! మీకు ఎంతోశ్రమ ఇచ్చాను. మీ రు చూపిన శ్రద్ధాసక్తులకు, నేను కృతజ్ఞత తెలుపుకుంటున్నాను." అన్నది.

# 3

రెండురోజులు గడిచాయి. ఉషారాణి వస్తూనే, "ఏం సంయుక్తా, రామ కోటయ్యగారి కొడుకుని కట్టుకోబోతు న్నావుటకదూ !" అన్నది.

"నాన్‌సెన్స్ ! నీకే తోచిందా, ఎవ రైనా చెప్పేరా నన్నిలా ఎగతాళి చెయ్యమని ?" అంది సంయుక్త.


ఉష నవ్వుతూ "అలా కరవకే తల్లీ ! వాళ్ళు జరగాలని ఆశిస్తూన్నది జరుగ బోతోందని సూచిస్తున్నా రందరితోనూ ....విష్‌ఫుల్ థింకింగ్ అన్నమాట."

"మా నాన్నగారు మాకాఅభిప్రాయం లేదని తేల్చేదాక వాళ్ళెందు కిలా వెంట పడడం ?"

"ఎందుకేమిటే, బోలెడాస్తితో వచ్చే నిన్ను దక్కించుకోవాలన్న ఆశవల్ల !"

ఆ ప్రసక్తి వదలి, ఆ పడుచులిద్దరూ ఏవేవో కబుర్లు చెప్పుకున్నారు. సుధా కర్ మాట వచ్చి సంయుక్త "అతడు ఏలూరుదాకా వెళ్ళడానికి సిద్ధపడినసంగతి పూసగుచ్చినట్లు చెప్పింది. "నైస్ చాప్!" అని మెచ్చుకుంది, ఉషారాణి.

ఆ రాత్రి సంయుక్తకు సరిగా నిద్ర పట్టలేదు. ఏలూరు పెళ్ళికొడుకూ, రామ కోటయ్యా, ఆయన బొద్దెంక మీసాల కుమారుడూ, ఆ కుమారుని మేనమామా, ఉషారాణీ, సుధాకరూ—అందరూ కలగా పులగంగా ఆమె ఆలోచనలలో ప్రవేశిం




చారు. ఆమె లేచి పచార్లు చెయ్యడం ప్రారంభించింది. మెదడు కూడా పని చెయ్యడం ప్రారంభించి, తటాలున ఆ ఫొటో సమస్య చిక్కు విడిపోయినట్లైంది! ఆమె వెంటనే ఒక జాబు వ్రాసి కవరులో పెట్టింది. తెల్లవారడంతోనే ఉషారాణిని కలుసుకుని, "నీకు టీ పార్టీనాడు సుధాకర్రావుగారితో పరిచయం అయింది గనుక ఈ జాబును తీసుకెళ్ళి ఆయనకిచ్చివస్తావా దయచేసి?" అన్నది.

ఉష నవ్వుతో. "లవ్ లెటర్ కాదు కదా?" అంది. సంయుక్త కోపంగా "రబ్బిష్ మాట్లాడకు!" అని కసురుకుంది. "కవరు చింపి చూడు కావలిస్తే. ఉమా, ఇమేజన్ప్రొప్రయిటర్ ఫొటోలనుకంబైన్ చేయించడానికి తీసుకువచ్చిన మనిషిని మళ్ళీచూస్తే గుర్తుపట్టగలనన్నాడు కదూ. ఈ చీటీలో నాకు అనుమానం తగిలిన ఒక మనిషి పేరూ, చిరునామా రాసి పంపుతున్నాను" అంది సంయుక్త.

"అన్నట్టు ఇంకా విలన్ ఎవరో తేలలేదు కదూ?" అంటూ ఉషారాణి సంయుక్త సన్నటి నడుమును తన చేతితో చుట్టేసింది. తన మంచం మీదకు లాక్కుపోయి కూర్చోబెట్టుకొని బుజ్జగిస్తో, "ఏదో తమాషాకంటే అంత కస్సుమన్నావేమిటే?" అంది. సంయుక్త మెల్లిగా, "అందని మ్రానిపండునకు అర్రులు చాచవచ్చునా ఉషా?" అన్నది.

ఉష, "నీ విలువను నీవు అంచనా కట్టుకోలేకపోతున్నా వన్నమాట। సుధాకర్ కాదు, అతని తాతలాంటి వాళ్ళు...."

"ఆగాగు. ఏ తాతనీ మాత్రం నాకు సిఫారసు చెయ్యకు।" అన్నది సంయుక్త ....ఆడపడుచు లిద్దరూ కిలకిలా నవ్వుకున్నారు.

"నువ్వే వెళ్ళి ఇవ్వచ్చుగా ఈ చిరునామా ?" అని ఉష అడగబోయింది. అడిగితే సంయుక్తం ఏమి జవాబిచ్చేదో కాని, ఉషారాణి, తను వెళ్ళడమే ఒకందుకు మంచిదని తోచి బయల్దేరింది.

జడ్జీ గారింట ఆమె సుధాకర్‌తో, "ఆ పెళ్ళి కొడుక్కి నచ్చ చెప్పడానికి మీరు ఏలూరుకూడా వెడతామన్నారుట కదూ ?" అన్నది.

"ఔనండి చదువూ, చక్కదనం — అన్నీ ఉన్న ఆ అమ్మాయిని అతగాడెవరోకాని ఇలా ఉత్తినే పుణ్యాన్ని జారవిడుచుకోవడం దురదృష్టం కాదంటారా?" అన్నాడు సుధాకర్రావు.

"మీరు అతగాణ్ణి వప్పిద్దామనుకున్నా, సంయుక్త మనస్సు విరిగిపోయిందిలెండి చాలా సున్నితమైన మనస్సు దానిది."


## 4

ఆ మరునాటి ఉదయం సుధాకర్రావు త్రివిక్రమరావు గారింటికి వచ్చి సంయుక్తతో, "మన విడి ఫోటోలను కంబైన్ చేయించి తీయించినది మీరు అనుమానించిన వ్యక్తియే అని తేలింది 'ఉమాఇమేజస్' ప్రొప్రయిటర్ని మీరిచ్చినచిరునామాకు పంపిఆవ్యక్తికి తెలియకుండానే గుర్తు పట్టించారు. 'కేశవరామ్ స్టుడియో' అనుమానంపైన బర్తరపు జేయబడిన నౌకరు కుర్రవాడిచేతకూడా గుర్తు పట్టించారు. ఆ వ్యక్తివాడిచేతిలో ఓ రూపాయి పెట్టి నా ఫొటోను దక్కించు కున్నాడన్న సంగతీ ఆ కుర్రవాడు పోలీసాఫీసరు ఎదుట ఒప్పుకున్నాడు. మీ నాయన గారు కంప్లెయింటు రాసి ఇస్తే. పోలీసులు కేసు నడుపుతారు" అన్నాడు సుధాకర్.

"వద్దండి ; మా నాన్నగారికి చెప్పనే వద్దు. ఆయనకు తెలుస్తే కోపం ఆపుకోలేరు. ఏమైనా జరగ వచ్చు. ఇన్‌స్పెక్టర్ గారితో కూడా "ఇదంతా గోప్యంగా ఉంచ వలసిందని చెప్పండి దయచేసి" అన్నది సంయుక్త.

సుధాకర్రావు, "సరేకాని ఈ వ్యక్తి మీద మీకు అనుమానం ఎలా కలిగింది ?"

"మా ఇంట కనబడ్డ పుస్తక మల్లా పట్టుకుపోయిచదువుతా డాయన. ఆ లైబ్రరీ బుక్కు గూడా ఈయన తీసుకు వెళ్ళినట్లు జ్ఞాపకంవచ్చి, దానిలో నేను పెట్టిన ఫొటో మాట గుర్తుకొచ్చింది. నా వివాహ విషయంలో తక్కిన మిత్రుల కన్నా ఈయన ఎక్కువ ఆసక్తి తీసు




కుంటున్నట్లు తెలిసి, ఆలోచనలో పడే సరికి ఆ ఏలూరు సంబంధం చెడగొడత ఈయన కాదుకదా అన్న అనుమానం కలిగింది." అంది సంయుక్త.

సుధాకర్ నవ్వుతో "మీరు ఉద్యోగంలో చేరదలుచుకుంటే క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్మెంటును ఎన్నుకోండి" అన్నాడు.

బయటనుండి వచ్చిన త్రివిక్రమరావు గారు సుధాకర్‌ను చూడటంతోనే, యోగ క్షేమాలు అడుగుతో అతనికి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నారు. 'ఏమిటి మిస్టర్, విశేషాలు?'

అతడేం సమాధానమిస్తాడో అని చూస్తున్న సంయుక్తతో సుధాకర్ "నేను కాఫీ తీసుకోకుండా వచ్చాను. దయచేసి ఒక కప్పు కాఫీ తెచ్చి పెడతారా?" అన్నాడు. ఆమె, "ఇంత మందమతినై పోయానేమిటి?" అని నొచ్చుకుంటూ లోపలకు పరిగెత్తింది. అతడు ప్రకటించిన నిర్మొగమాటం వెనుక ఏదో ఉద్దేశం ఉన్నదని గ్రహించిన రావుగారు అతనివైపు ప్రశ్నార్థకంగా చూసేసరికి అతడు చిరునవ్వుతో "సంయుక్తగారు వచ్చేలోగా తమతో ఒక సంగతి మనవి చెయ్యాలి" అన్నాడు.

"చెప్పు. ఏమిటో"

ఆ ఏలూరు సంబంధమంటే ఆమె పై ముఖ్యం కనపర్చారు కనుక అడుగుతున్నాను. ఆమెకూ, మీకూ అంగీకారమైతే, ఆమెను నా కిచ్చి వివాహం చేయవలసిందని కోరుతున్నాను" అనేశాడు సుధాకర్.

తనకు అతడు అల్లుడు కాగోరుతాడు అని కలలోనైనా వూహించని త్రివిక్రమ రావు-సంతోషం పట్టలేక, ఉబ్బెత్తుగా లేచి వెళ్ళి-సుధాకర్‌ను కౌగిలించు కున్నాడు! కాఫీతో ప్రవేశించిన సంయుక్త ఆ దృశ్యాన్ని చూస్తో చిత్తరువుగా నిలబడి పోయింది. వీధమ్మటవచ్చినరామకోటయ్య అలవాటు ప్రకారం గుమ్మం ఎక్కాడు. అతణ్ణి చూడటంతోనే రావుగారు తన సంతోషాన్ని పంచుకోదలచి సుధాకర్‌ను చూపిస్తో, "జడ్జీగారబ్బాయితను. మా సంయుక్తను పెళ్ళి చేసుకుంటానని చెప్పడానికి వచ్చాడు. మనం వెంటనే వెళ్ళి ఇతని తండ్రి గారిని కలుసుకొని తాంబూలాలు ఇయ్యాలోయ్. నువ్వు కూడా రావాలి." అన్నాడు.

సుధాకర్‌ను పరిశీలిస్తున్న రామకోటయ్యతో సంయుక్త, "ఎరగని ముఖం చూసినట్లు చూస్తున్నారేమిటి రామకోటయ్యగారూ? మిలటరీలో ఉన్నారని చెప్పిన మీ అల్లుడు గారే ఈయన!" అన్నది.

సుధాకర్ అందుకొని, "ఉమా ఇమేజస్" స్టూడియోలో మీరు కంబైన్ చేయించిన ఈ ఫోటోను చూస్తేగాని నన్ను పూర్తిగా గుర్తుపట్టలే రనుకుంటాను." అంటూ, ఆ ఫోటో గ్రాపును తన లెదర్‌బాగ్‌లో నుండి పైకితీసి, ఆయన కళ్ళకి ఎదురుగా పెట్టేడు.

ముచ్చెమటలు పోయడం ప్రారంభమైన రామకోటయ్య వణుకుతో, "ఈ ఫొటో నేను కంబైన్‌చేయించడ మేమిటి? లేనిపోనిది కల్పించకండి!" అన్నాడు. అప్పటికి సంగతి బోధపడిన త్రివిక్రమ రావుగారు రుద్రుడై, "స్నేహితిడి మల్లే రోజూ ఇంటికివచ్చిపోతూ ఇంతద్రోహం తలపెట్టేవా, రాస్కెల్? అంటూ అతని మీదకు పోపోయేసరికి సుధాకర్ ఆయనను చటుక్కున రెండు చేతులతోనూ వాటేసుకుని రామకోటయ్యతో "వీరిని అట్టేసేపు ఆపడం కష్టం సర్. వెంటనే ఇక్కడ నుంచి వెళ్ళిపొండి!" అన్నాడు.

రామకోటయ్య పిక్కబలం చూపడంతో రావుగారు కోపంగానే"చూస్తోండి, పరువు నష్టానికి దావా పడేసి, వీణ్ణి ముప్పుతిప్పలూ పెట్టి, మూడు చెరువుల నీళ్ళు తాగిస్తాను!" అన్నారు. సంయుక్త, "వద్దు నాన్నా, ఆయన తల పెట్టినది ద్రోహమే అయినా, మనకి మహోపకారం గానే పరిణమించింది!" అన్నది.

ఆమె మౌనంగా నిలబడి తన అదృష్టాన్ని తలుచుకుంటూ సుధాకర్‌వైపు చూసింది. ఎక్కడలేని సిగ్గూ ఒక్కసారిగా ముంచెత్తి రావడంతో, ఆమె గగుర్పాటుతో లోనికి పరుగెత్తి తల్లి ఒడిలో వాలి పోయింది.

●